క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే రవీంద్రకుమార్



కేటీఆర్‌తో ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా

దేవరకొండ: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కలిశారు. నల్లగొండ జిల్లాలో పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను ఆయన మంత్రికి వివరించారు. ఆయన వెంట నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, భువనగిరి పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. గురువారం ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని చింతపల్లి వాగు నుంచి డిండి మండల కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి మండల కేంద్రంలో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం

త్రిపురారం: మండలంలోని అంజనపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజనపల్లి గ్రామానికి చెందిన బూర చినలింగయ్య, బూర అచ్చాలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి వ్యవసాయంతో పాటు పశువులు ఉండడంతో వాటి మేత కోసం ఇంటి వద్దనే గడ్డివాములు వేశారు. కాగా గురువారం మధ్యాహ్నం ఆ గడ్డివాములకు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. అయితే గడ్డివాములకు అతి సమీపంలోనే విద్యుత్ తీగలు ఉండడంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకొని ఉంటాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దగ్ధమైన గడ్డి విలువ రూ.70వేల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

రాష్ట్ర కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

త్రిపురారం: హైదరాబాద్‌లో ఈ నెల 29న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని టీఎమ్మార్పీస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మొండికత్తి అశోక్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో త్రిపురారం టీఎమ్మార్పీస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బొజ్జ సోమయ్య, సైదులు, కుమ్మరి విజయ్, జెర్రిపోతుల నాగయ్య, పడిశల సైదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవం



ఫ్యాషన్ డ్రెస్ కాంపిటీషన్‌లో పాల్గొన్న అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు

గుర్రంపోడు: మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో గల అంగన్‌వాడీ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఫ్యాషన్ డ్రెస్ కాంపిటీషన్, రోల్ ప్లే నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మర్రి అనితాసైదులు, అంగన్‌వాడీ టీచర్ శశికళ, ఆయా నిర్మల, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన వారందరికీ సభ్యత్వం ఇవ్వాలి

మాడుగులపల్లి: 18 ఏళ్లడు నిండిన గొల్ల కురుమలందరికీ ప్రభుత్వం గొర్రెల పెంపకందారుల సహకార సంఘంలో సభ్యత్వం కల్పించి, యూనిట్లు మంజూరు చేయాలని ఆ సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ కార్యాలయం అధికారికి సంఘం సభ్యులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. మాడుగులపల్లి మండలం అభంగాపురంలో సహకార సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వేములపల్లి మండలం కేంద్రంతో పాటు బుగ్గబావిగూడెంలో నేటికి మొదటి విడత గొర్రెల పంపిణీ చేయలేదని, సంఘంలో సభ్యత్వం ఉండి డ్రా సమయంలో అందుబాటులో లేనివారికి మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత డొల్ల

- సీసీ రోడ్డు వేసిన రెండు రోజులకే పగుళ్లు
- నాసిరకంగా పనులు చేపట్టారని ఆరోపిస్తున్న ప్రజలు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



కొత్తబావి గ్రామంలో సీసీ రోడ్డుపై పగుళ్లు



తగిన ఎత్తు లేకుండా వేసిన సీసీ రోడ్డు

కొండమల్లేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తూ నిధులు విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో కొందరు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై, నాణ్యతకు తిలోదకాలు ఇస్తుండడంతో సీసీ రోడ్డు వేసిన రెండు రోజులకే పగుళ్లు వస్తున్నాయి. కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబావి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యత రెండు రోజులకే తేలిపోయింది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సీసీ రోడ్డు వేయడంతోనే పగుళ్లు వచ్చాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే గతంలో వేసిన సీసీ రోడ్డు సైతం ఆరు నెలలు గడవకముందే కంకర తేలింది. సీసీ రోడ్ల నిర్మాణంలో 12 ఫీట్ల వెడల్పు, ఏడు ఇంచుల ఎత్తు ఉండాల్సి ఉన్నా ఇవేమీ పట్టించుకోకుండా తూతూ మంత్రంగా సీసీ రోడ్లు వేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ గ్రామ సర్పంచ్ గతంలోనే నిధుల దుర్వినియోగానికి పాల్పడడంతో చెక్ పవర్ తొలగించారు. అధికార పార్టీ సర్పంచ్ కావడంతో మళ్లీ తిరిగి చెక్ పవర్‌ను పొందారు. అయినా సదరు సర్పంచ్ తీరులో మార్పు రాకపోవడం పట్ల గ్రామస్తులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తగిన నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యత పాటించాలి

సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. నాణ్యత లేకుండా రోడ్ల నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదు. ఎవరైనా తమ గ్రామ పరిధిలో సీసీ రోడ్లు సరిగ్గా లేవని ఫిర్యాదు చేస్తే కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటాం. నిర్దేశించిన ఎత్తు ప్రకారమే సీసీ రోడ్డు వేయాలి. ఇష్టానుసారం వ్యవహరించొద్దు.

– ధర్మేంద్రకుమార్, పంచాయతీరాజ్ ఏఈ

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



త్రిపురారం: వీఓఏల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

త్రిపురారం: వీఓఏలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని శ్రీనిధి కార్యాలయం ముందు వీఓఏలు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం 11వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ వీఓఏల నిరసనకు మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి ఐడీ కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు పడిశల సైదులు, పుష్పలత, స్వామి, అనిత, నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

మండల కేంద్రంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారయణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మే డే రోజున సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో పోలె సాంబయ్య, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దైద శ్రీను, సీఐటీయూ మండల అధ్యక్షుడు సర్వారెడ్డి, రైతు సంఘం నాయకులు కొప్పు వెంకన్న, కార్మిక సంఘం నాయకులు గోగుల ఇద్దయ్య, చందన బోయిన సుధాకర్, మద్దెల శ్రీనివాస్, లక్షయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి



వీఓఏల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి

పెద్దవూర: వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత పదకొండు రోజులుగా మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య వేధిస్తున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. వీఓలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాన్ని అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. రూ.10లక్షల సాధారణ, ఆరోగ్య బీమా కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, ప్రతి నెల వేతనాలను వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, నాయకులు పాల్తి శంకర్‌నాయక్, పాండు నాయక్, జానపాటి నాగయ్య, దేవ్‌సింగ్, ఏరుకొండ పద్మ, తిరుపతయ్య, వీరేశం పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసన సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నూకల వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ: నల్లగొండ పరిధిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన సభను జయప్రదం చేయాలని మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నిరుద్యోగ నిరసన ర్యాలీకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. నోటిఫికేషన్ల పేరుతో కోట్ల రూపాయలు దండుకొని నిరుద్యోగుల నిండా ముంచారన్నారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ పార్టీ గట్టిగా కొట్లాడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజహర్, ఉపాధ్యక్షుడు సిద్దునాయక్, మాజీ సర్పంచ్ జంగిలి లింగయ్య, పోటిపాక వినయ్, గుడిపాటి కృష్ణ, షేక్ అజారొద్దీన్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వివిధ పట్టణాలలో ఏర్పాటు చేయబోతున్న బ్యాంకులలో ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాలకు గాను జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 120 మంది నిరుద్యోగులు హాజరు కాగా 45మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్యగౌడ్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ రాంరెడ్డి, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ క్లస్టర్ మేనేజర్ రఫీక్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా రవి



నూతన అధ్యక్షుడు రవిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ సంఘం సభ్యులు

హాలియా: పీఆర్‌టీయూ టీఎస్ అనుముల మండల శాఖ నూతన అధ్యక్షుడిగా గుర్రం రవి ఎన్నికయ్యారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో హాలియా పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో నూతన అధ్యక్షుడు గుర్రం రవిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనుముల మండల ప్రధాన కార్యదర్శి మంచికంటి మధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొల్లు శ్రీనివాస్‌రెడ్డి, బాణావత్ సక్రు నాయక్, జిల్లా బాధ్యులు మంద సైదులురావు గౌతమ్, పాపిరెడ్డి, సుబ్బారావు, సీనియర్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్ చంద్రుడునాయక్, పెద్దవూర మండల ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు నెమలి వెంకటరెడ్డి, పెద్దవూర హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, అనుముల మండల బాధ్యులు అహ్మద్, బూరుగు రామ్మూర్తి, సైదిరెడ్డి, కె. సైదిరెడ్డి, బాణావత్ శ్రీను తదితరులు ఉన్నారు.

పేదలకు అండ.. ఎర్ర జెండా



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: పేదలకు ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. దామరచర్ల మండలంలోని వాడపల్లి, బొల్లిగుట్టతండాలకు చెందిన ప్రజలు, కార్మికులు గురువారం జూలకంటి రంగారెడ్డి సమక్షంలో సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు కావొస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్, నిత్యావసర ధరలను విపరీతంగా పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మికులను మరిన్ని కష్టాలకు గురిచేస్తుందన్నారు. వీటన్నింటిపై ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ మాలోతు వినోద్, నాయకులు పాపానాయక్, దయానంద్, శ్రీనునాయక్, బాల సైదులు, ఖాజా తదితరులు ఉన్నారు.

పాడి రైతులకు ఎమ్మెల్సీ సహాయం



ఎమ్మెల్సీ కోటిరెడ్డి అందజేసిన పశుగ్రాసంతో బాధిత రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని జాల్‌తండాకు చెందిన పలువురు పాడి రైతుల పశుగ్రాసం(ఎండు గడ్డి) కొద్దిరోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి మూడు రోజుల క్రితం తండాకు వెళ్లి ప్రమాదం జరిగిన తీరును రైతులను అడిగి తెలుసుకొని వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు నలుగురు రైతులకు ఒక్కో ట్రాక్టర్ చొప్పున నాలుగు ట్రాక్టర్ల గడ్డిని ఎమ్మెల్సీ తన సొంత డబ్బులతో గురువారం రైతుల ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున కూడా బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్సీ తెలిపారు.

'నక్కలగండి'ని త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

చందంపేట: నక్కలగండి ప్రాజెక్టును ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేసి నల్లగొండ జిల్లా ప్రజల నీటి గోసను తీర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికి ప్రచార యాత్ర గురువారం మండలంలోని గుంటిపల్లి, పోల్యానాయక్ తండా, ముడుదండ్ల, చందంపేట, ముర్పునూతల, కోరుట్ల, నక్కలగండి తదితర గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, మైనొద్దీన్, సీపీఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, కనకాచారి, బొమ్ము అచ్చయ్య, జనార్దన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఆంజనేయులు, మొగిలయ్య పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాడుగులపల్లి: వీఓఏలతో కలిసి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మాడుగులపల్లి: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏల సంఘం మండలాధ్యక్షురాలు జల్ల పుష్ప డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు నిర్వహిస్తున్న నిరసన దీక్షలో భాగంగా గురువారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం దారుణమని మండిపడ్డారు. కనీస వేతనం చెల్లించాలని, అర్హత కలిగిన వారికి సీసీలుగా పదోన్నతి ఇవ్వాలని కోరారు. జెడ్పీటీసీ సైదులు, కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, వెంకన్న, మోహన్, సైదానాయక్ దీక్షకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల కార్యదర్శి దానియేలు, సైదమ్మ, ఉపాధ్యక్షురాలు యాదమ్మ, సంయుక్త కార్యదర్శి జ్యోతి, పావని, సంతోషి, సైదమ్మ, జానమ్మ పాల్గొన్నారు.

కార్మికులు, ప్రయాణికులే ఆర్టీసీకి మూలస్తంభాలు



మాట్లాడుతున్న మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీ సంస్థకు ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులు మూలస్తంభాలని మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ›నేను నా ఉద్యోగంలో రాణిస్తా‹ అనే అంశంపై ఆర్టీసీ కార్మికులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రయాణికులను గౌరవిస్తూ వారిని గమ్యస్థానాలకు చేర్చాలని అన్నారు. ప్రయాణికులతో మర్యాదగా, ప్రేమగా మాట్లాడటంతో పాటు ప్రయాణికులు చేయి ఎత్తిన చోట తప్పనిసరిగా బస్సును ఆపాలని సూచించారు. మిర్యాలగూడ ఆర్టీసీ డిపో లాభాల బాటలో ఉందని, ఆక్యుపెన్సీని పెంచడంలో ఉద్యోగులు, కార్మికుల పాత్ర అభినందనీయమన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో డిపో ఆదాయం రూ.6.65 కోట్ల వరకు వచ్చిందన్నారు. వేసవిలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని, అందుకు అనుగుణంగా బస్సులను నడుపుతున్నామని అన్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమంలో పలు సూచనలు, సలహాలు ఇచ్చిన పులి కృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

ధాన్యం కాంటాలకు విరామం

నిడమనూరు: నిడమనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా ఇప్పటివరకు ఆయా కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వే బిల్లు చెల్లించేందుకు గాను నాలుగు రోజుల పాటు ధాన్యం కాంటాలకు విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 25వ తేదీ వరకు మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా 631 మంది రైతుల నుంచి 54,652 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఐకేపీ, వెనిగండ్ల సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో యథావిధిగా కాంటాలు జరుగనున్నాయి. వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండడంతో కాంటా వేస్తే ధాన్యం తడుస్తుందేమోనని కాంటాలు నిలిపివేశారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన కాంటాలు వేయాలని రైతులు కోరుతున్నారు.



నిడమనూరు మార్కెట్ యార్డులో స్థలం దొరక్క వే బ్రిడ్జిపై ధాన్యం ఆరబోసిన రైతులు

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



నాగార్జునసాగర్: హిల్‌కాలనీలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ ఐదో వార్డులో బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ హిరాకార్ రమేశ్‌జీ బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామకృష్ణ, మంగ్తానాయక్, ఆదాసు నాగరాణివిక్రం, శిరీష మోహన్‌నాయక్, లింగాల పెద్దులు, చాంద్‌పాషా, కందగట్ల వీరయ్య, పిట్ట సైదులు, కండెల వెంకటేశ్వర్లు, మైలపల్లి రమణ, సర్వారెడ్డి, మంద కిషోర్, ఉక్కు, అస్గర్, పెరికి వెంకటేశ్వర్లు, శివకుమార్, బద్దపాక విష్ణు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



మిర్యాలగూడ టౌన్: తడకమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ బండమీదిగూడెం సెక్టార్ పరిధిలోని తడకమళ్ల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం-1, 2, 3, 4లో గురువారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. అదేవిధంగా మండలంలోని ఉట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కూడా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వల్లపుదాసు జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ అబేద, అంతమ్మ, మేహరున్నీసా బేగం, గంగు మాధవి, ఉమామహేశ్వరీ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ మేళా

హాలియా: ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని పంగవానికుంట, పేరూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ గంధం పద్మావతి, సూపర్‌వైజర్ రమాదేవి, పేరూర్ సర్పంచ్ యడవెల్లి సుధారాణినాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు వనజ, సోనీబేగం, అశ్విని, పంగవానికుంట టీచర్లు సునీత, జ్యోతి, ఏడబ్ల్యూహెచ్ కమల, మంగమ్మ, జాకిర తదితరులు ఉన్నారు.



హాలియా: పేరూర్ అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ వేషధారణలో చిన్నారులు

గొనె సోలోమోన్‌ను ఎమ్మెల్సీగా ప్రకటించాలి

కొండమల్లేపల్లి: తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ అసోసియేషన్(టీయూసీపీఏ) కార్యదర్శి గొనె సోలోమోన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని గురువారం కొండమల్లేపల్లిలో జరిగిన టీయూసీపీఏ సమావేశంలో పలువురు పాస్టర్లు ప్రభుత్వాన్ని కోరారు. గొనె సోలోమోన్ క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి గత కొంతకాలంగా ఎంతో కృషిచేస్తున్నారని అసోసియేషన్ సభ్యులు, పాస్టర్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాస్టర్లు ఎ. ఎలీషా, కె. షాలోమ్ రాజ్, వి.మార్క్, కెఫిలిప్, డానియేల్ తదతరులు పాల్గొన్నారు.

వీఓఏల వంటావార్పు



అడవిదేవులపల్లి: సమ్మెలో భాగంగా వంటావార్పు చేస్తున్న వీఓఏలు

అడవిదేవులపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు వంటా వార్పుతో నిరసన తెలిపారు. అనంతరం వీఓఏల సంఘం మండల అధ్యక్షులు కుర్ర నాగానాయక్ మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునీ, లక్ష్మణ్, భవాని, జ్యోతి, భ్రమరాంబ, వినోద, వెంకటేష్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

డిండి: మండల కేంద్రానికి చెందిన వసంత శాంతమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కాగా డిండి యువత చేయూత ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో భాదమోని శ్రీనివాస్‌గౌడ్, ఏటి. కృష్ణ, నూకం వెంకటేష్, బల్మూరి సైదులు, చింతపల్లి నరేష్, అవుట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.